క్లుప్తంగా

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడలో రైల్వే ఆసుపత్రి కొత్త ఓపీడీ భవనంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎంవీ సుబ్బారావు పాల్గొని క్షయ వ్యాధి లక్షణాలు, వాటి నివారణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారు డాట్స్ చికిత్స, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ శౌరిబాల, ఏసీఎమ్ఎస్‌లు డాక్టర్ ఎమ్. జయదీప్, డాక్టర్ రవికాంత్, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): సంపూర్ణ పోషణ్ ద్వారా అందించే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే సరుకులు, నాణ్యతతో సకాలంలో అందించేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే ఆహార పదార్థాల సరఫరా నాణ్యతపై శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా 1,475 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలనానరు. ముఖ్యంగా స్వచ్ఛమైన పాలు, గుడ్లు సరఫరా చేసేలా ఏజెన్సీలను ఆదేశించాలన్నారు. బియ్యం, పప్పు, ఆకుకూరలు, నాణ్యతతో సకాలంలో సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చిన్నారులు శ్రద్ధగా చదువుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ):స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పి.సుధ ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ చదువుతూ అంచెలంచెలుగా ఎదుగుతున్న విద్యార్థులు మరింత శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సెయింట్ జాన్స్ విద్యా సంస్థల సెక్రటరీ/కరస్పాండెంట్ టి. సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్‌లు మాట్లాడారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ టి.రామాభారతి, ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెంజి సర్కిల్ జంక్షన్ అభివృద్ధికి చర్యలు

పటమట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ జంక్షన్‌ను మరింత ఆకర్షణీయంగా, సుందరంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఈ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బెంజిసర్కిల్ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ పింక్ టాయిలెట్స్ వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా టాయిలెట్స్ పనులు సత్వరమే పూర్తి చేయాలని, టాయిలెట్స్ పరిసరాల్లో మొక్కలు ఏర్పాటు చేసి పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన ఏర్పాటు చేసిన గ్రీనరీ అభివృద్ధి పరచాలన్నారు. పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన అక్కడక్కడ గ్రీనరీ లేకపోవడం గమనించిన ఆయన గ్రీనరీని ఏర్పాటు చేయాలని ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స విధానంపై అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు):అత్యవసర సమయంలో బాధితులకు ప్రథమ చికిత్స చేయు విధానంపై శుక్రవారం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం ఆధ్వర్యంలో సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్టుపై శిక్షణ ఇచ్చారు.

పరిశ్రమల స్థాపనకు త్వరగా అనుమతులు

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్):జిల్లాలో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించే విధంగా త్వరితగతిన అనుమతులు మంజూరుచేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డిఐఇపిసి) సమావేశం కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఆర్థిక ప్రగతి మెరుగుపడుతుందని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 21 రోజులోగా సంబంధిత శాఖలు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. తద్వారా జిల్లా పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందించిన వారవుతామని పేర్కొన్నారు. షెడ్యూల్ కులాలు, తెగలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలపై అవగాహన పెంచాలని తెలిపారు. పెట్రోలియం, నైట్రేట్ ఉత్పత్తులకు సంబంధించి లైసెన్సులు, ఎన్‌ఓసీలను కొత్తగా ఏర్పాటు చేసిన లైసెన్సింగ్ సిస్టమ్ ఫర్ డిస్ట్రిక్ట్ అథారిటీస్ (ఎల్ఎస్ఓఏ) పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఎస్సీ,ఎస్టీ, మహిళ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే స్టార్టప్ ఇండియా పథకంలో యూనిట్ల ఏర్పాటు లక్ష్యాలను



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

పూర్తి చేయాలన్నారు.

పెట్టుబడి రాయితీ విడుదల....

వైఎస్సార్ జగనన్న బడుగు వికాస పథకంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించటంలో భాగంగా 64 యూనిట్లకు పెట్టుబడి రాయితీగా రూ. 11 కోట్ల 61 లక్షలా 29 వేల 894తో పాటు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2010–15, 2015–20 ఆర్థిక సంవత్సరాల్లో పావలా వడ్డీ రీయింబర్స్‌మెంట్‌గా రెండు యూనిట్లకు రూ.1లక్ష 41 వేల 157, సేల్స్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ రెండు యూనిట్లకు రూ.29 లక్షల 6 వేల 745 మొత్తంగా రూ.11 కోట్ల 91 లక్షలా 77 వేల 796 మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై.వీరశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. ప్రసాదరావు, డెప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌లు టి. నాగప్రసాద్, కె.విజయలక్ష్మి, డిఎఫ్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎఎఫ్‌వో మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై బోర్‌వెల్స్ మంజూరు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమృత్ జలధార యువ పారిశ్రామికవేత్తల పథకం కింద బోర్‌వెల్స్, డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకునేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అమృత్ జలధార పథకం లబ్ధిదారుల ఎంపికపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నగరంలోని ఆయన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (అజయ్) అమృత్ జలధార పథకం ద్వారా కనీసం 2.5 ఎకరాల సాగు భూమి కలిగి ఈ ఏడాది బ్యాంకుల ద్వారా రుణాలు పొంది బోర్‌వెల్స్, డ్రిప్, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల నుంచి రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్‌కు రూ. 50 వేలు గాని, ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం ఈ రెండింటిలో ఏది తక్కువైతే అంత మొత్తాన్ని ఆర్థిక సహాయంగా అందిస్తామని వెల్లడించారు. నీటిపారుదల లేని వ్యవసాయ భూములు, వ్యక్తిగతంగా గానీ, సాముహికంగా గానీ, వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్ కులాల వ్యక్తులు వార్షికాదాయం రూ. 3 లక్షల లోపు కలిగి ఉన్న వారిని ఎంపిక చేస్తామన్నారు.

మంజూరు పత్రాలు అందజేయాలి...

మార్చి 31వ తేదీ లోపు లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను జారీ చేయాల్సి ఉందన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, భూ. గర్భ జల శాఖ అధికారి, వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్లు సమన్వయంతో లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ అధికారి బి. చంద్రలీల, డ్వామా పీడీ జె. సునీత, భూగర్భజల శాఖ అధికారి బి. నాగరాజు, పరిశ్రమల శాఖ అధికారి వి. శేఖర్ తదితరులున్నారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ మంత్రి



మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులకు అమ్మవారి ప్రసాదాలు అందిస్తున్న చైర్మన్, ఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, చైర్మన్, ఈవోలు అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలు అందించారు. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, బచ్చు మాధవీకృష్ణ, కొలుకులూరి రామసీత, కేసరి నాగమణి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):కొట్టు దగ్గర సరుకులు తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లిన తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఓ తండ్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ లెనిన్‌సెంటర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ నూర్ బాషాకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె (23) పదో తరగతి వరకూ చదువుకొని, కొన్నేళ్ల నుంచి ఇంటి వద్దే ఉంటుంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో కొట్టులో సబ్బులు కొనుక్కొని వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద విచారణ చేసినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం

జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ):రంజాన్ అంటే కేవలం ఉపవాస దీక్ష మాత్రమే కాదని, మనిషిలోని చెడు భావనలు, ఈర్ష్య ద్వేషాలను రూపుమాపే పవిత్రమైన మాసమని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. మత సామరస్యానికి రంజాన్ మాసం ప్రతీకగా నిలుస్తుందన్నారు. రంజాన్ మాసం ప్రారంభమైన తొలి శుక్రవారం సందర్భంగా భవానీపురంలోని పున్నమి ఘాట్ వద్ద గల మొహమ్మదీయ మసీదును సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

మసీదులోని మత పెద్దలతో సంభాషించి సమస్యలు ఏమైనా ఉన్నాయేమో అడిగి తెలుసుకున్నారు. ముస్లింలందరికీ పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మసీదు ప్రాంగణంలోని



మసీదులో ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్

మదర్సాను సందర్శించి అక్కడి విద్యార్థులతో మమేకమై వారి బాగోగులు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ముతవల్లి అబ్దుల్ అజీజ్, ముస్లిం మత పెద్దలు షేక్ బడేమియ, సయ్యద్ రఫీ, అష్రఫ్ అలీ, ఉమర్ షరీఫ్, అబ్దుల్ కరీం, అజ్మత్, రసూల్, బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ పదబంధ పరిమళాలు గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్:నగరానికి చెందిన ప్రముఖ రచయిత, పరిశోధకుడు డాక్టర్ జీవీ పూర్ణచందు రచించిన తెలుగు గంగ పదబంధ పరిమళాలు గ్రంథాన్ని కాశీలోని బెనారస్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆవిష్కరించామని రచయిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వారికి గంగానదికి విడదీయలేని అనుబంధం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగు గంగ పదబంధ పరిమళాలు పరిశోధక గ్రంథం రచన సాగిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర సమాచారహక్కు మాజీ కమిషనర్



ఆచార్య మాడభూషి శ్రీధర్, బెనారస్ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు బూదాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ జీవీ పూర్ణచందు తెలుగు గంగ కవి అయ్యారని అభినందించారు. బెనారస్ యూనివర్సిటీలో చదువుతున్న తెలుగు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య ద్రోహి చంద్రబాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నోటుకు ఓట్లను కొనుగోలు చేస్తూ నిరంతరం దిగజారుడు రాజకీయాలకు పాల్పడే చంద్రబాబు దేశంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య ద్రోహి అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ మండిపడ్డారు. వించిపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయినా చంద్రబాబు సిగ్గులేకుండా మళ్లీ అదే తరహా తెర చాటు వ్యవహారాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిగ్గుమాలిన రాజకీయాలకు పాల్పడటం అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 23 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాజకీయ వ్యభిచారానికి పాల్పడ్డారన్నారు.

ముదిరాజులకు గుర్తింపునిచ్చిన ఏకైక సీఎం జగనన్న

ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వెంకట నారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ):రాష్ట్రంలో ముదిరాజు సామాజికవర్గానికి గుర్తింపునిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న వెంకట నారాయణ అన్నారు. గత ప్రభుత్వంలో తమ సామాజిక వర్గానికి మొండి చెయ్యి చూపించిన చంద్రబాబు ఇప్పుడు బీసీల మంత్రం జపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీని ఆయన శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన కొందరు ముదిరాజ్ నాయకులు ఇటీవల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు కేవలం హామీలు మాత్రమే ఇస్తారని తెలిపారు. ఆచరణలో శూన్యమన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు మేనిఫెస్టో అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. సీఎం జగ



మంత్రి విడదల రజనికి పుష్పగుచ్ఛమిచ్చి అభినందిస్తున్న చైర్మన్ కేవీ నారాయణ

నన్న తమ ఆడపడుచు విడదల రజనీకి మంత్రి పదవి ఇచ్చి గౌరవించిన సంగతిని టీడీపీ నాయకులు గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లిబోయిన రాజు, కార్యదర్శి సాంబశివరావు, యువత అధ్యక్షులు కె ఏడుకొండలు, కృష్ణ – ఎన్టీఆర్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు తుమ్మ శ్రీనివాస రావు, కె.లక్ష్మణరావు, కుంచె రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):భర్త అదృశ్యంపై భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లంబాడీపేట తోట లక్ష్మయ్య వీధికి చెందిన పోలవరపు పద్మావతి, రాము భార్యాభర్తలు. రాము శిల్పాలు తయారు చేస్తుంటాడు. ఈ నెల 21వ తేదీ రాము శిల్పాలు తయారు చేసి ఇవ్వాలని చెప్పి హడావుడిగా వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై విజయవాడకు చెందిన ఎం. ప్రణతి బృందానికి చెందిన ప్రాజ్ఞవి, సీహెచ్.తాన్యా, టి.మహాశ్రీ నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులను చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు అభినందనలు తెలియజేసి అమ్మవారి ప్రసాదాలను అందించారు.

చిత్రం విజయం సాధించడం ఆనందంగా ఉంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దాస్‌కా దమ్కీ చిత్రం మంచి విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని, అంతకంటే ముఖ్యంగా మంచి సినిమాను ప్రేక్షకులకు అందించానని సంతృప్తిగా ఉందని నటుడు, దర్శకుడు విశ్వక్ సేన్ అన్నారు. మాస్ కా ధమ్కీ చిత్రం విజయాత్రలో భాగంగా శుక్రవారం నగరంలోని జయరాం థియేటర్‌లో ప్రేక్షకులతో కలసి కొద్ది సేపు సినిమాను వీక్షించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉగాది పండుగ సందర్భంగా సినిమాను విడుదల చేశామన్నారు. మంచి ఓపెనింగ్స్ వచ్చాయని, సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటున్నారని అది చాలా ఆనందంగా ఉందన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ డిస్ట్రిబ్యూటర్ అసిస్టెంట్ మేనేజర్ పి. పవన్ కుమార్ విష్వక్సేను పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతించారు. జయరాం థియేటర్ మేనేజర్ కె.



మాట్లాడుతున్న ప్రముఖ నటులు, దర్శకులు విశ్వక్ సేన్

రాజ్ కుమార్ మాట్లాడుతూ మొదటి రోజు నుంచి మంచి ఓపెనింగ్స్ ఉన్నాయని, పరీక్షలు అయిపోగానే మంచి కలెక్షన్స్ రాబడుతుందన్నారు. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూటర్స్ పి.వసంత కుమార్, పి.పవన్ కుమార్, జయరామ్ థియేటర్ బాధ్యులు వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే నూతన పెన్షన్ రద్దుపై కమిటీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానంపై కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించడానికి ఫైనాన్స్ సెక్రటరీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు సాగిస్తున్న పోరాటాల ఫలితమే అని మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ జీఎస్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారందరికీ నూతన పెన్షన్ విధానం అమలవుతుందని చెప్పారు.

ఈ పెన్షన్ విధానంలో పదవీ విరమణ చేసిన వారికి ఎలాంటి గ్యారంటీ పెన్షన్ లేక పోవటంతో వారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. దీనిపై ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌లు నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం పోరాట మార్గం పట్టాయన్నారు. అందులో భాగంగానే నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో ఫిబ్రవరి 21న రాష్ట్రపతికి మెయిల్ ద్వారా లక్షల మంది నిరసన తెలియజేశారన్నారు. అదే విధంగా రైల్వే కార్మికుల దేశ వ్యాప్త పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి నూతన పెన్షన్ విధానంపై ఫైనాన్స్ సెక్రటరీ అధ్యక్షతన కమిటీ వేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం రద్దు తప్ప వేరే ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దేశ వ్యాప్త నిరసనలు తప్పవని హెచ్చరించారు.

మార్కెట్‌లోకి సరికొత్త వెర్నా కారు విడుదల

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని సాయిస్వర్ణ హుందాయ్ షోరూమ్‌లో సరి కొత్త మోడల్ వెర్నా కారును నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ ఈ సరి కొత్త కారు అత్యంత భద్రతా ప్రమాణాలతో రూపుదిద్దుకుందన్నారు. ముఖ్యంగా 30కి పైగా సాధారణ, 65కు పైగా అడ్వాన్స్‌డు భద్రతా ప్రమాణాలను ఇనుమడింపజేశారన్నారు. వీటిలో 6 ఎయిర్ బ్యాగ్స్, వీఎస్ఎంతో కూడిన ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ అసిస్ట్ కంట్రోల్, ఆల్ వీల్ డిస్క్‌బ్రేక్, ఇపిబి, ఈసీఎం, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్ తదితర ప్రత్యేకతలున్నాయని వెల్లడించారు. ఈ కారు ఆకర్షణీయమైన 7 మోనోటోన్ రంగులు, 2 డ్యుయల్ టోన్ రంగుల్లో లభిస్తుందన్నారు. ప్రారంభ ధర రూ.10.90 లక్షలని తెలిపారు.



వెర్నా కారు విడుదల చేస్తున్న షోరూమ్ ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లు

కార్యక్రమంలో సుందరం ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ ఎం. దుర్గా శ్రీనివాస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఉప్పు మహేష్, యాక్సిస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాజేష్‌కుమార్, ఐసీఐసీఐ బ్యాంకు రీజనల్ హెడ్ రంగనాథ్ పాల్గొన్నారు.

బైక్ టైరు పేలి యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ప్రయాణిస్తున్న బైక్ టైర్ పేలి ఒకరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి కాలనీకి చెందిన కోరాడ సూరిబాబు షాబాద్‌లో కుమార్ ఏజెన్సీలో పని చేస్తుంటాడు. ఈ నెల 17వ తేదీన సూరిబాబు కంపెనీకి వెళ్లేందుకు రోడ్డుపైకి రాగా అదే కంపెనీలో పని చేసే సత్యనారాయణ కనిపించడంతో బండి ఎక్కాడు. పాముల కాల్వ వద్దకు వచ్చే సత్యనారాయణ నడుపుతున్న మోపెడ్ వెనుక టైరు పేలిపోవడంతో ఇద్దరు రోడ్డుపై పడ్డారు. దీంతో సూరిబాబు తలకు దెబ్బ తగలడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి సోదరుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మసీదుల్లో గంజి పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో చిట్టినగర్, లంబాడీపేట, కేఎల్‌రావునగర్, వైఎస్సార్ కాలనీలోని మసీదుల వద్ద శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం ఇఫ్తార్ కోసం మసీదులలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా మసీదుల వద్ద గంజి పంపిణీ చేశారు. గంజి కోసం చిన్నారులు, యువకులు బారులు తీరి కనిపించారు. గంజి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మసీదు కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఇఫ్తార్ కోసం మసీదులలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.